ప్రజాశక్తి
సోమవారం 21 ఏప్రిల్ 2025

బెట్టింగ్ భూతానికి యువకుడు బలి

◆ రైలు కింద పడి ఆత్మహత్య
◆ 'ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లకండి.. జీవితం నాశనం చేసుకోకండి' అంటూ తన టీషర్ట్‌పై రాసుకుని మృతి

ప్రజాశక్తి-హిందూపురం

బెట్టింగ్ యాప్స్ బారిన పడి యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఈ మధ్య పెరిగాయి. ఈజీ మనీ ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌తో చాలా మంది డబ్బులు, ఆస్తులు పోగొట్టుకొని, ఆర్థిక ఒత్తిడితో ప్రాణాలు తీసుకుంటున్నారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లాలో చోటు చేసుకుంది. హిందూపురం పట్టణంలోని గుడ్డం సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పరిగి మండలం పైడేటి గ్రామానికి చెందిన జయచంద్ర(24)గా గుర్తించారు. ప్రతి ఒక్కరు వినియోగించే అండ్రాయిడ్ సెల్ ఫోన్స్ లో ఆన్ లైన్ గేమింగ్ లు ఉన్నాయి. ఈ గేమింగ్ కు అలవాటు పడిన జయచంద్ర ఆన్ లైన్ లో బెట్టింగ్ లో లక్షలాది రూపాయాలు పోగొట్టుకున్నాడు.. ఆ యువకుడు ఆత్మహత్య చేసుకునే సమయంలో విద్యార్థులు ఆన్ లైన్ లో బెట్టింగులు ఆడకండి అని ఆన్ లైన్ గేమింగ్ అప్లికేషన్‌లను డిలీట్ చేయాలని తన టీ షర్ట్ మీద రాసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

జయచంద్ర (ఫైల్‌ఫొటో)

పరిగి మండలం పైడేటి గ్రామానికి చెందిన జయచంద్ర(24) డిగ్రి పూర్తి చేసుకుని పాల డెయిరీ, ఇటుకల బట్టి వ్యాపారం, వ్యవసాయం చేస్తు జీవనం చేస్తున్నాడు. బెట్టింగ్‌లో సుమారు రూ. 6 లక్షల వరకు డబ్బులు పోగోట్టుకున్నాడు. పాలడెయిరీ, ఇటుకల బట్టి ఉనంచి వచ్చిన డబ్బులు అన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టాడు. తన వద్ద డబ్బులు లేనప్పుడు బయట అప్పులు చేశాడు. విషయం తెలిసిన జయచంద్ర తండ్రి ఆదినారాయణ కుమారుడిని పలుసార్లు మందలించాడు.ఉన్న అప్పులను తాను కట్టేస్తానని ఇకనుండి ఇలాంటి బెట్టింగ్ జోలికి వెళ్లకుండా బెంగళూరులో ఉద్యోగం చేసుకోవాలని సలహా ఇచ్చాడు.దీంతో జయచంద్ర ఈనెల 17వ తేదీన తాను బెంగళూరుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు ఫోన్ ద్వారా ఎక్కడున్నావ్ అని అడిగితే తాను బెంగళూరులో ఉద్యోగంలో జాయిన్ అయ్యానని చెప్పాడు. అయితే బెట్టింగ్, అప్పులతో మానసిక వేదనకు గురైన జయచంద్ర శనివారం రాత్రి హిందూపురం గుడ్డం సమీపంలో రైల్వే ట్రాక్ పై రైలు కింద పడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు గమనించి వివరాలు సేకరించారు. మృతుడు పరిగి మండలం పైడేటి గ్రామానికి చెందిన జయచంద్రగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు జయచంద్ర తన టీ షర్ట్‌పై ' ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లకండి.. జీవితం నాశనం చేసుకోకండి' అంటూ తన టీ షర్ట్‌పై పెన్నుతో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తన టీషర్ట్‌పై రాసుకున్న పదాలు యవతను ఆలోచింప జేస్తున్నాయి.

మేధస్సును కదిలించేది 'శ్రమ కావ్యం'

ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

మేధస్సు ను కదిలించేది శ్రమ కావ్యం, గానం అని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో సిఐటియు ,ఐద్వా, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రమ కావ్యం గానం పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాజపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ జీవితం గురించి సాహితీ స్రవంతి నాయకురాలు డాక్టర్ ప్రగతి తెలియజేశారు .అనంతరం శ్రమ కావ్యం ఉద్దేశించి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు సుద్దాల అశోక్ తేజ సినీ రచయిత మాత్రమే కాదని ఆయన రచనలు శ్రమ శక్తిని చాటి చెప్పేవిగా ఉన్నాయని తెలిపారు. శ్రమ కావ్యమే కాకుండా నేను అడవి, శూద్రగంగా వంటి రచనలు గొప్పగా ఉన్నాయని కొనియాడారు .అనంతరం సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ శ్రమ కావ్యం గానం గురించి వివరించారు. ఇందులో శ్రమ యొక్క విలువ ఎంతో గొప్పగా వివరించారన్నారు. శ్రమ అన్నది మేధో శ్రమ శారీరక శ్రమ రెండు రకాలుగా ఉంటుందని చెప్పారు ఈ రెండు కలగలిసి ప్రయాణం సాగిస్తుంటాయని వివరించారు దీన్ని శ్రమాయణం అని కూడా చెప్పవచ్చునన్నారు .శ్రమ ద్వారానే సామాజిక గమనం ఉంటుందని శ్రమ కావ్యం గానం ద్వారా ఆయన వివరించారు .ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్ర, సిఐటియు నాయకులు ఆర్‌వి. నాయుడు, యుటిఎఫ్ జిల్లా నాయకులు లింగన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, సామాజిక వేత్త బోస్, మానవతా రక్తదాతల తరిమెల అమర్నాథ్ రెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

ముగ్గురు మృతి

ఒకేచోట ఇద్దరు మృత్యువాత

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ శివారులో వేర్వేరుగా ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఉరవకొండ పట్టణ శివారులో వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన వెంకటేష్‌నాయక్, కొత్తకోటకు చెందిన శాంతమ్మ కలిసి ద్విచక్ర వాహనంలో ఉరవకొండకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

అలాగే అనంతపురం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవళిక తమ్ముడి నిశ్చయ శుభకార్యానికి ఉరవకొండ నుంచి చాబాలకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో ప్రవళిక మృతిచెందింది. ఆయా ఘటనలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మృతిచెందిన వెంకటేష్‌నాయక్, శాంతమ్మ, ప్రవళిక (ఇన్‌సెట్‌లో)

టిడిపి నాయకులు జకీవుల్లా మృతి

ప్రజాశక్తి -అనంతపురం

మాజీ రాజ్యసభ సభ్యుడు సైపుల్లా కుమారుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కె. ఎం జకీవుల్లా గుండెపోటుతో ఆదివారం కేర్ హాస్పిటల్ లో తుది శ్వాస విడిశారు.గతంలో ఇదే కుటుంబం నుంచి రహమతుల్లా టిడిపి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేసి ఓడిపోవడంతో గన్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. జకీవుల్లా మృతితో సైపుల్లా కుటుంబంలో విషాదం నెలకొంది.జకీవుల్లా మృతి వార్త తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

జకీవుల్లా (ఫైల్‌ఫొటో)

డీఎస్సీ నోటిఫికేషన్ జారీపై డివైఎఫ్ఐ హర్షం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నిరుద్యోగ యువత ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేయడం పట్ల డివైఎఫ్ఐ హర్షం వ్యక్తం చేసింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు బాలకృష్ణ, కసాపురం రమేష్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వాగతిస్తు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, పోరాటాలు చేసిన క్రమంలో అక్రమ కేసులు కూడా తమపై నమోదు అయ్యాయని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం చేపట్టిన పోరాటాలను దృష్టిలో పెట్టుకుని పోరాట సమయంలో నమోదు చేసిన అక్రమ కేసులను కొట్టివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టవర్‌క్లాక్ వద్ద చంద్రబాబు ఫ్లెక్సీకి క్రేన్‌తో పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీ, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

సర్వం కల్తీమయం

◆ కదిరిలో పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు
◆ చోద్యం చూస్తున్న అధికారులు ◆ ప్రమాదంలో ప్రజారోగ్యం

ఎవరు ఏమైతేనేమీ మాక్కావలసింది కాసులు అన్న స్వార్థంతో ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. పలు రకాల పేర్లతో ప్రజలను ఆకర్షించే విధంగా ఎక్కువ శాతం కల్తీ మయమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారు. ఇష్టానుసారంగా ఫాస్ట్ ఫుడ్ యజమానులు కల్తీ ఆహారం విక్రయిస్తుంటే సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరిలో సర్వం కల్తీమయమైంది. పలు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు రకరకాల పేర్లతో ప్రజలకు తీవ్ర అనారోగ్యాన్ని తెచ్చే ఆహారాన్ని విక్రయిస్తున్నారు. ఎక్కువ శాతం కయవిక్రయాలు చేస్తున్న వాటికి సంబంధించిన శాఖ మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. రుచికరంగా ఉండాలన్న కారణంతో టేస్టింగ్ సాల్ట్‌ను ఎక్కువ మోతాదులో వాడుతూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. కదిరిలోని డిమార్ట్ సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, బస్టాండు సమీపాన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఎక్కువగా ఉన్నాయి. మద్యం దుకాణాల వద్ద కూడా ఇవి ఇబ్బంది ముబ్బడిగా వెలిసాయి. ఈ లెక్కన కదిరిలో వందదాకా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లలో నాశికరమైన ఆహార పదార్థాలను వేడిచేసి రకరకాల రంగులు, టేస్టింగ్ సాల్ట్ కలిపి విక్రయిస్తున్నారు. వీటిని తింటున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. చికెన్ మటన్ ఎక్కడ తక్కువ ధరకు లభిస్తే అక్కడ తీసుకొని వండి పెట్టడమే కాకుండా మిగిలిపోయిన మాంసాన్ని చల్లని పెట్టెలో భద్రపరిచి మళ్లీ మళ్లీ వేడి చేసే ప్రజలకు అందిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నాశిరకమైన టమోటా సాస్, మిర్చి సాస్‌ను ఆహార పదార్థాల్లో వాడుతున్నట్లు తెలుస్తోంది. కదిరిలో ఏ రహదారి ప్రక్క వెళ్లిన ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా కన్పిస్తున్నాయి. వాటిని నివారించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు కూడా రాకపోలేదు. ఫాస్ట్ ఫుడ్ తీసుకున్న పిల్లలలో రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా చిన్న వయసులోనే పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో పిల్లల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడిపోతోంది. ఇక ఈసెంటర్లలో పార్సిల్ కట్టడానికి సిల్వర్ పేపరును వాడుతున్నారు. ఈ పేపర్ వాడకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఫాస్ట్ ఫుడ్ నిర్వహకులు మాత్రం వాటికి భిన్నంగా ఎక్కువ మోతాదులో సిల్వర్ పేపర్లు వాడడం కన్పిస్తోంది. ఈ పార్సిల్‌ను కూడా ప్లాస్టిక్ కవర్లతో పెట్టి ఇస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని ప్రకటనలు ఇస్తూ నామమాత్రంగా చిన్నచిన్న వ్యాపారస్తులు వద్ద తనిఖీలు చేసి జరిమానా విధించి మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పెద్ద హోటళ్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు, ఇతర వర్గాల వారు ఎక్కువ శాతం హోటళ్లలోని ఆహార పదార్థాలను స్వీకరిస్తున్నారు. పలు హోటళ్ల నిర్వాహకులు ఎక్కువ కాలం నిలువ ఉంచిన మాంసంతో వంటలు వండి ప్రజలకు అనారోగ్యాన్ని తెచ్చిపెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు రోజువారిగా తనిఖీలు చేయడం కొనసాగిస్తే ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, హోటళ్ల నిర్వాహకులు జాగ్రత్త పడి ప్రజలకు మంచి ఆహార పదార్థాలను అందించడానికి అవకాశం ఉంటుంది.

పట్టణంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

డ్వాక్రా సంఘాల మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ నరసయ్య పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధిలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా ఈ సంస్థ కృషి చేస్తుంది. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించడం, శ్రీ నిధి ద్వారా స్వయం ఉపాధికి చేయూతనివ్వడం, వ్యక్తిగతంగా, సంఘంపరంగా యూనిట్లను నెలకొల్పి అందులో వచ్చే ఆదాయంతో మహిళలు అభివద్ధి చెందే విధంగా తోడ్పడడం లాంటివాటిలో డిఆర్‌డిఎ ఎంతో కృషి చేస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగి మహిళా సాధికారిత సాధించాలని సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలను బాల్య వివాహాలను అరికట్టాలని తదితర సామాజిక అంశాలలో శిక్షణలు కూడా అనుబంధ సంస్థ వెలుగు ద్వారా అందిస్తున్నారు. ప్రభుత్వపరంగా ఏ పథకమైనా మహిళల పేరిట పొందాలన్న డ్వాక్రా సంఘంలో సభ్యురాలుగా ఉండాలన్న విధానం ఉండటాన్ని బట్టి చూస్తే మహిళా సంఘాల మహిళలకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మహిళల అభివృద్ధికి వినూత్నంగా పథకాలు కూడా సంస్థ చేపడుతోంది. ప్రతినెలా పింఛన్ల పంపిణీ డిఆర్‌డిఎ పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు.?

జవాబు : జిల్లాలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 1311 గ్రామాలలో 32,402 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3,51,888 మంది సభ్యులు ఉన్నారు. అలాగే జిల్లాలో 32 మండలాలలో మండల మహిళా సమైక్యలు ఉన్నాయి. గ్రేడింగ్ లో చూసుకుంటే ఏ గ్రేడ్ లో 24,724 సంఘాలు, బి గ్రేడ్ లో 7,341 సంఘాలు, సి గ్రేడ్ లో 1119 సంఘాలు, డి గ్రేడ్ లో 3 సంఘాలు ఉన్నాయి.

ప్ర : బ్యాంకు లింకేజీ, శ్రీనిధి ద్వారా ఎన్ని సంఘాలకు రుణ సదుపాయం కల్పించారు.?

జ : గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 10,358 సంఘాలకు రూ. 1020 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించడం జరిగింది. శ్రీనిధి ద్వారా 2498 సంఘాలలోని 16,945 మంది సభ్యులకు 117.98 కోట్ల రూపాయల రుణం అందించడం జరిగింది.

ప్ర : స్వయం ఉపాధికి ఇంకా మీ సంస్థ చేపడుతున్న పథకాలు వివరించండి.?

జ: ఉన్నతి పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 681 సంఘాలలోని 1576 మంది డ్వాక్రా మహిళలకు రూ. 9.19 కోట్లు రుణం అందించడం జరిగింది. ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన పథకం క్రింద రూ. 50 వేలు సబ్సిడీ ఇస్తూ యూనిట్ ద్వారా జీవనోపాధి అమలు కోసం 51 మంది ఎస్సీ మహిళలకు రూ. 71.50లక్షలు ఇచ్చేలా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రౌండ్ చేయనున్నాము. ఇందులో లబ్ధిదారుల వాటా రూ.7.15 లక్షలు కాగా రూ.38.85 లక్షలు సబ్సిడీ ఉంటుంది. లఖ్ పతి దీదీ పథకం కింద నెలకు రూ. 10 వేల ఆదాయం మించి వ్యాపారాలు చేసుకునే విధంగా యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం వంద శాతం సాధించడం జరిగింది. ఏడాదికి లక్ష రూపాయలు పైగా సంపాదించే విధంగా యూనిట్లు స్థాపించడం జరిగింది. ఉదయ్ ఆక్వా కనెక్ట్ క్రింద మత్స్యకార శాఖ ద్వారా ఏడాది పొడవునా నీరు లభ్యత బట్టి తాడిమర్రి మండలాన్ని పైలట్ యూనిట్ గా ఎంపిక చేసి ఒక్కొక్క యూనిట్‌కి రూ. 4.22 లక్షల డిపిఆర్‌లను సిద్ధం చేశాం. త్వరలో బ్యాంకు రుణాలు ద్వారా రెండు యూనిట్లను ప్రారంభించబోతున్నాము. ఖేతి నెట్ పథకం ద్వారా తనకల్లు, నల్లచెరువు మండలాలలో 51 మంది లబ్ధిదారులను గుర్తించాం. కదిరి ప్రాంతంలో ఆహార ఉత్పత్తులతోపాటు మల్లెల తోటల పెంపకానికి చేయూతని అందిస్తున్నాం. తనకల్లు, నల్లచెరువు ప్రాంతాలలో 2వేల మంది రైతులకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. ధర్మవరం మండలం నిమ్మలకుంట తోలుబొమ్మలాటకు సాంకేతికత జోడించి వారి జీవనోపాధి పెంచే విధంగా 100 కుటుంబాలకు శిక్షణ ఇస్తున్నాం.

ప్ర : ఎన్టీఆర్ భరోసా క్రింద ఇచ్చే పింఛన్ల వివరాలు తెలపండి.?

జ : జిల్లాలో 2,62,706 మంది పింఛన్ లబ్ధిదారులకు నెలకు రూ. 114.26 కోట్లు పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతోంది. ఇందులో వృద్ధులు, వితంతు, వికలాంగులు, చేనేతలు, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారులు, అభయ హస్తం, హిజ్రా, కిడ్నీ బాధితులు, గీత కార్మికులు, మంచానికే పరిమితమైన బాధితులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెల ఒకటవ తేదీన సచివాలయాల ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్ర : మహిళా సంఘాలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ : ప్రతినెల మహిళా సంఘాల సమావేశాలు జరుగుతుంటాయి. గ్రామ, మండల, జిల్లాస్థాయి సమావేశాలలో చర్చించిన అంశాలను గుర్తించుకొని స్వయం అభివృద్ధికి ప్రణాళికలు వేసుకొని కుటుంబ పోషణకు తగిన ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వం ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము.

క్రీడాకారులతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్, ఆర్‌డిటి సంస్థ సంయుక్తంగా ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మైదానానికి పంపించే ప్రతి క్రీడాకారుల తల్లిదండ్రులు పిల్లలకు మంచి భవిష్యత్తు ఇచ్చేవారే అన్నారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. కావున ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం తాడిపత్రి సలార్, అనంతపురం జిఎన్‌జి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తాడిపత్రి సలార్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. అనంతపురం జట్టు 20 ఓవర్లలో 240 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సలార్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసే సరికి 149 పరుగులు సాధించి ఓటమిపాలైంది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో విగ్నేశ్వర, బత్తలపల్లి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విగ్నేశ్వర 181 పరుగులు సాధించింది. బత్తలపల్లి జట్టు నిర్ణీత 18 ఓవర్లు ముగిసే సరికి 121 పరుగులు సాధించి ఓటమి పాలైంది.

కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం

ప్రజాశక్తి-అనంతపురం

అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.కిరణ్‌కుమార్

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బి.కిరణ్‌కుమార్ ఆదివారం అనంతపురంలో అనంత వెంకటరామిరెడ్డితోపాటు వైసిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలనకు చరమగీతం పాడి, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. శాంతియుత పాలన సాగిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సతీష్, శ్రీనివాసులు, రియజ్, శ్రీనివాసులనాయక్, కోడూరు రాము, అహ్మద్, శివ, కళ్యాణ్, అనిష్, కుమార్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీపై హర్షం

కేక్ కోస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

పెద్దవడుగూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణను ఆమోదిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడంపై పెద్దవడుగూరులోని ఎంఆర్‌పిఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేశారని, అలాగే మందకష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ అమలు సాధ్యానికి వీలైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆదినారాయణ, కత్తుల కొండయ్య, భూపతి రంగస్వామి, కృష్ణ, నరేంద్ర, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

జకీవుల్లా మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

అనంతపురం : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపీ సైపుల్లా కుమారుడు జకీవుల్లా గుండెపోటుతో మరణించడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంల్లో ఇద్దరం పాల్గొన్నామని గుర్తు చేశారు. అర్బన్ నియోజకవర్గంతో పాటు జిల్లా టీడీపీకి జకీవుల్లా చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మరణం తీరని లోటు అన్నారు.

అలాగే జకీవుల్లా హఠాన్మరణం చాలా బాధాకరమని టిడిపి నాయకులు కమ్మూరు నాగరాజు అన్నారు. జకీవుల్లా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జై డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాన్స్ మాస్టర్ కార్తీక్ వారి బృందం జానపద, సినీగీతాలకు నృత్య ప్రదర్శనలు చేసినట్లు పరిపాలన అధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

అడుగంటిన భూగర్భజలాలు

వందల అడుగులు వేసినా పైకిరాని జలం - ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి-యల్లనూరు

నీరు లేకపోవడంతో బీళ్లుగా మారిన పొలాలు

వేసవి సమిపించిందంటే చాలు భూగర్భజలాలు అడగంటిపోతాయి. బోరుబావులు ఎండిపోయి రైతన్నలను ఆందోళనలోకి వెళ్తారు. లక్షలు వెచ్చించి వందల అడుగుల లోతు బోర్లు వేస్తున్నా చుక్క నీరు పైకి రావడం లేదు. దీంతో రైతులు అయోమయానికి లోనవుతున్నారు. మండలంలోని బొప్పేపల్లి, వాసపురం, కూచివారిపల్లి, యల్లనూరు, కోడుమూర్తి గ్రామాల్లో ఇప్పటికే బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. నీరు లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో ప్రస్తుతం వేల ఎకరాల్లో అరటి సాగులో ఉంది. మరోవైపు ఏప్రిల్‌లో వచ్చే ముంగారు వాన జాడ కనిపించడం లేదు. వాగులు, వంకలు పొర్లు తేనే బోర్ల లో నీళ్ల పెరుగుతాయి. లేదంటే రానున్న రోజుల్లో రైతంగాం నిర్వీర్యం అవుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో గండికోట రిజర్వాయర్ నుంచి దాదాపు రూ.118కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని ఈ ప్రాంత రైతులు, ప్రజలు కోరుతున్నారు.

48 శాతం పనులు పూర్తి

ఎత్తిపోతల పథకం ద్వారా ఇదివరకే 85నిట్టూరు చెరువు పరిధిలోని ఎల్ 6 లైన్ పనులు దాదాపు 48శాతం పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం సుమారు రూ.60 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో కాంట్రాక్టర్‌కు బిల్లులు సరిగా చెల్లించలేకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయినట్లు సమాచారం. ఈ పథకం పూర్తయితే సుమారు 11వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కావున కూటమి ప్రభుత్వంలోనైనా మిగిలిన పనులు పూర్తి చేసి నీరు ఇవ్వాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఎత్తిపోతలను పూర్తి చేయాలి

85 నిట్టూరు చెరువు ఎత్తిపోతల ద్వారా బొప్పేపల్లి, బుక్కాపురం చెరువులకు నీరందించవచ్చు. అంతేగాకుండా ఆయా చెరువుల కింద సుమారు 10 నుంచి 15 గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. అలాగే పుట్లూరు మండలంలో కూడా రెండు నుంచి నాలుగు గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి.

రైతు సుబ్బిరెడ్డి

భూగర్భజలాలు పెరుగుతాయి..

గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే దాదాపు రెండు మండలాల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. ముఖ్యంగా బొప్పేపల్లి చెరువు కింద 500 ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు. అంతేగాకుండా 10 గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.

రైతు మల్లేష్

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు

ప్రజాశక్తి-పామిడి

పోస్టర్లను విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వతేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధరాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం ముందు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. అప్పట్లో తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ప్రస్తుతం సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా నేటికీ హామీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మిక సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు సలీం, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మాబు, మండల కార్యదర్శి శివకుమార్, సుల్తాన్, నజీర్, షాసు, నాగరాజు, తలారి రాము, కొండాపురం నాగరాజు, నరసింహులు, రాజు, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఈనెల 25వతేదీన కలెక్టరేట్ నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టిరామాంజనేయులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుల శివ, శంకర, ఐద్వా నాయకురాలు వెంకటమ్మ, భవన నిర్మాణ కార్మికులు రామకృష్ణ, రామాంజనేయులు, ఆది, వైకుంఠ చారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అబ్దుల్‌రసూల్

మైనార్టీల మార్గదర్శి జస్టిస్ సచార్

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అబ్దుల్‌రసూల్

ప్రజాశక్తి-అనంతపురం

ముస్లిం మైనార్టీలకు మార్గదర్శిగా జస్టిస్ సచార్ సేవలు చిరస్మరణీయమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది ఎస్.అబ్దుల్‌రసూల్ కొనియాడారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఉన్న సమావేశ మందిరంలో ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆల్‌మేవా ఆధ్వర్యంలో రాజేందర్ సచార్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ రాజేంద్ర సచార్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, మానవ హక్కుల ఉద్యమకారుడుగా ముస్లిం మైనార్టీల స్థితిగతులను అధ్యయనం చేసి వారి అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, ఆల్ మేవా రాష్ట్ర సహాధ్యక్షులు వై.ఫక్రుద్దీన్ ఇన్సాఫ్, నాయకులు అల్లిపీరా, ఆవాజ్, వలి, అష్రఫ్ అలీ, జిలాన్, అన్వర్, షేక్షావలి, హిదాయతుల్లా, మక్బూల్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పైప్‌లైన్ పనుల పరిశీలన

పుట్లూరు : మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాలకు శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు గండికోట నుంచి ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకే గండికోట నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తయితే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అనంతరం తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేసినందుకు కందికాపుల సర్పంచు శివరామయ్యను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కోమటికుంట కులశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు 6వ తరగతి ప్రవేశ పరీక్ష

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఈనెల 21వ తేదీన సోమవారం 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు.

దాది రతన్‌మోహన్ సంతాప సభ

దాది రతన్‌మోహన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయదుర్గం : ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం 5వ గ్లోబల్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ దాది రతన మోహిని (101) సంతాప సభను ఆదివారం రాయదుర్గంలోని బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయంలో నిర్వహి ంచారు. ఈనెల 8వతేదీన రతన మోహిని తుదిశ్వాస విడువగా 10వతేదీన అంత్యక్రియలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో విశ్వవిద్యాలయం ఆవరణలో సంచాలకులు బికె యోగేశ్వరి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌వి రాధాకృష్ణ, జయప్రకాష్, ప్రసాద్, గోవింద, మహేష్ సిద్ధప్ప, సురేష్, కమలాక్షి, సిద్ధమ్మ, లక్ష్మి, జ్యోతి, భాగ్యమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై కార్మికులకు అవగాహన

హిందూపురం : అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆర్ టి సి గ్యారేజ్ లో అగ్ని ప్రమాదాలపై కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో ఏసీ బస్సు, గ్యారేజ్ లలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎలా అర్పాన్న దానిపై అవగాహన కల్పించారు.కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీకాంత్, ఎంఎఫ్ రామ్ నిశంత్ కుమార్, గ్యారేజ్ సిబ్బందితో పాటు అగ్నిమాప సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

శింగనమల : మండల పరిధిలోని చిన్నజాలాపురం గ్రామానికి చెందిన చింతకుంట ఆదిరెడ్డి, ఓబుళమ్మ కుమారుడు చింతకుంట హరినాథరెడ్డి (28) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. హరినాథ్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. దీనికితోడు ఇంటి వద్ద వ్యవసాయ పనులు చూస్తూ ఉండేవాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి తోట వద్దకు పడుకోవడానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తోటకు వెళ్లిన తల్లిదండ్రులు గమణించి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న వైసిపి మండల నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి చిన్నజలాలపురానికి చేరుకుని హరినాథ్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్మికుడు మృతి

బొమ్మనహాల్ : మండలంలోని అరేసముద్రం రెవెన్యూ పరిధిలో ఉన్న జిందాల్ కర్మాగారం సమీపంలో తాపీ మేస్త్రీగా పని చేస్తున్న ఛతీష్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన అఖిలేష్ (36) ఆదివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్ఐ నబిరసూల్ తెలిపిన వివరాల మేరకు.. అఖిలేష్ శనివారం ఉదయం బొమ్మనహాల్‌కు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడని జిందాల్ పరిశ్రమ యాజమాన్యం తెలిపిందన్నారు. అతిగా మద్యం తాగి ఎండవేడిమికి తట్టుకోలేక మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి తమ్ముడు గోయల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుకు పాముకాటు

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో పాముకాటుతో ఓ రైతు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసింహులు ఆదివారం పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన రైతు వెంటనే విషయాన్ని పక్కపొలాల రైతులు, కుటుంబ సభ్యులకు చెప్పాడు. పాముకాటుతో అస్వస్థతకు గురైన రైతును వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు నరశింహులును మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు.

జూదరులు అరెస్టు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు : మండలంలోని భీమునిపల్లి గ్రామంలో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. భీమునిపల్లిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ : తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలైన ఘటన ఆదివారం ఉరవకొండ మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి దైవ దర్శనానికి వచ్చిన వెలుగొండ గ్రామానికి చెందిన ఒక కుటుంబంతోపాటు వారి బంధువులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో 20 మందికిపైగా గాయపడ్డారు. బాధితులందరినీ 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

మహిళలతో విప్ కాలవ శ్రీనివాసులు దంపతులు

జిల్లావ్యాప్తంగా టిడిపి శ్రేణులు ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కేకలు కోసం పంచిపెట్టారు. ముఖ్యంగా అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. అనంతరం అర్బన్ కార్యాలయం నుంచి టవర్ క్లాక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్.రాజు స్వయంగా బైక్ నడిపి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై ఎంపి అంబికా లక్ష్మీనారాయణ కూర్చొన్నారు. ర్యాలీలో వీరితోపాటు టిడిపి అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొని అలరించారు. టవర్‌క్లాక్ వద్ద చంద్రబాబు భారీ కటౌట్‌కు క్రేన్ సాయంతో పాలాభిషేకం చేశారు. తర్వాత 75 కిలోల కేక్‌ను కోశారు. కాగా ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహినంచారు. ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో విద్యార్థులకు యూనిఫారం పంపిణీ, పెద్దాసుపత్రి, తపోవనం వద్ద అన్నదానం చేశారు. 1వ రోడ్డులో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి శ్రీనివాస్‌చౌదరి, నరేంద్రచౌదరి, పరమేశ్వర్, మూర్తి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ సతీమణి విజయలక్ష్మి, కుమారుడు భరత్, కోడలు నిర్మల, మనమడు తక్ష శ్రీనివాస్, ఐసిడిఎస్ సిడిపిఒ ఎఎల్ విజయలక్ష్మి, టిడిపి పట్టణ కన్వీనర్ నాగరాజు, డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, నాయకులు హనుమంతు, వెంకటేశులు, మహబూబ్‌బాషా, భారతి, ప్రశాంతి, జ్యోతి, సంపత్‌కుమారి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : అనంతపురం నివాసంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ఆదివారం సిఎం చంద్రబాబు జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మనుమడు, మనుమరాలు పరిటాల రవీంద్ర, అమైరా రవీంద్రతో కలిసి కేక్ కోశారు.

పుట్లూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో కేక్ కోశారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా వైద్యులతో బిపి పరీక్షలు చేయించుకున్నారు. తర్వాత వృద్ధులకు ఉచితంగా మాత్రలు, బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, చవా కులశేఖర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఎల్‌కె చెన్నారెడ్డి, బ్రహ్మయ్య, గోవర్ధనరాజు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుచిత్రపటం వద్ద పరిటాల సునీత మనుమడు, మనుమరాలు

వైద్య శిబిరంలో బిపి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

జ్యోతుల మహోత్సవం

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో నెలపూజ సందర్భంగా జ్యోతులు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగగా అమ్మవారి జ్యోతులను పిండితో తయారు చేసి నూలుపోగులతో చుట్టి తలమీద పెట్టుకుని తొగట వీర క్షత్రియులు ఆనందంగా పాటలు పాడుతూ ఉత్సవం నిర్వమించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజల్లో తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతా పురుషోత్తం, చందా సితాంబరి, చింతా సాంబశివుడు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

రాయదుర్గం : కణేకల్ సమ్మర్ స్టోరేజ్ బ్యాంకు వద్ద 33 కెవి విద్యుత్ లైన్ మరమ్మతులు జరుగుతున్నందున ఆది, సోమవారాల్లో రాయదుర్గం పట్టణానికి తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ప్రజలందరూ సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

బెలుగుప్ప : ప్రమాదవశాత్తు మృతిచెందిన తోటి మిత్రుడు కుటుంబానికి సాటి మిత్రులు ఆర్థికసాయం చేశారు. మండల కేంద్రానికి చెందిన ఆర్‌హెచ్ సురేష్ అనంతపురంలో బిల్డింగ్ లిఫ్ట్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాస్తూ కింద పడి ఈనెల 11వ తారీఖున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1994లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థులు ఆదివారం సురేష్ స్వగృహానికి చేరుకుని చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సురేష్ కుటుంబానికి రూ.50వేల నగదు, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు అనిల్‌కుమార్, నాగరాజు, మల్లికార్జున, అమర్నాథ్, శివ రుద్ర, మహమ్మద్ రఫీ, జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు